క్లుప్తంగా

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



తల్లాడలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎస్ఈ, అధికారులు

మధిర/తల్లాడ: మధిర మండలం సిరిపురం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఖమ్మం ఎస్ఈ శ్రీనివాసాచారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న లోడ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, తల్లాడలో లోఓల్టేజీ నివారణకు ఏర్పాటుచేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఎస్ఈ ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో డీఈలు బండి శ్రీనివాసరావు, ఎల్.రాములు, భద్రుపవర్, ఏడీఓలు అనురాధ, రాందాస్, నెల్లూరు సతీష్, ఏఈలు మైథిలి, రాయల ప్రసాద్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రుక్మిణి

కల్లూరు: కల్లూరు వాసి ఎనుముల రుక్మిణీయాదవ్ చేపడుతున్న సేవా, అవగాహన కార్యక్రమాలకు డాక్టరేట్ లభించింది. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఉమెన్స్ వింగ్ నేషనల్ ప్రెసిడెంట్ అయిన ఆమె మానవ హక్కులు, చట్టాలపై అంగన్‌వాడీ, ఆశా, గ్రామదీపికలు, ప్రజలకు అవగాహన కల్పిస్తుండగా, సౌత్ ఆఫ్రికాకు చెందిన గుడ్ సమరటిన్ గ్లోబల్ పీస్ అకాడమీ బాధ్యులు డాక్టరేట్ ప్రకటించారు. విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రుక్మిణి డాక్టరేట్ అందుకున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

చింతకాని: మండల పరిధిలోని ప్రొద్దుటూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1996 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రంగాల్లో స్థిరపడిన వారందరూ 30ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలను చేసి ఆటాపాటలతో సందడి చేశారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



వెంకన్న మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

కారేపల్లి: కారేపల్లి భారత్ నగర్ కాలనీకి చెందిన వీఆర్ఏ వేమూరి వెంకన్న వడదెబ్బతో మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా.. సోమవారం ఆయన మృతదేహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరితో పాటు, గ్రామ పెద్దలు తలారి దేవప్రకాశ్, వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పర్యటించారు. మండలంలోని కుర్నవల్లికి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి అయిలూరి భావన ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. భావన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేశ్వాపురం, గొల్లగూడెం గ్రామాల్లో శుభ కార్యాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, కోటారెడ్డి, శ్రీను, బాబు, శివారెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠం మరణం పార్టీకి తీరని లోటు

ముదిగొండ: తాళ్లూరి వైకుంఠం మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాల్‌రావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు తెలిపారు. సోమవారం పెద్దమండవలో నిర్వహించిన ఆయన వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరించారు.

ప్రకృతి వనం.. అధ్వానం

పచ్చదనమే లేని పల్లె ప్రకృతి వనాలు

- బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఎదగని మొక్కలు
- ఎక్కడా కనిపించని ఆహ్లాదం..
- కొరవడిన పర్యవేక్షణ



ఎర్రుపాలెంలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో కానరాని మొక్కలు (ఇన్‌సెట్) శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఎర్రుపాలెం: గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో అడుగుపెట్టే నాథుడే కరువయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రకృతి వనాల వైపు పంచాయతీ సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు. నేడు ప్రకృతి వనాల నిర్వహణే లేకపోవడంతో వాటిల్లో ఏ మాత్రం పచ్చదనం కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లోని ప్రకృతి వనాల్లో నాలుగైదు మొక్కలు కూడా బతికి ఉన్న దాఖలాలు లేవు.

మండలంలో వివరాలిలా..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఒక ఎకరం భూమి విస్తీర్ణంలో పర్యావరణ పరిరక్షణ కోసం పల్లె ప్రకృతి వనాలను నిర్మించింది. ప్రతీ ప్రకృతి వనంలో 500 నుంచి 2వేల వరకు మొక్కలు నాటారు. వాటితో పాటు గ్రామస్తులు వాకింగ్, వ్యాయామం చేసేలా.. రెస్ట్‌కోసం ట్రాక్, బెంచీలను ఏర్పాటు చేశారు. దీనికి గానూ ఒక్కొక్క దానికి రూ.2 నుంచి 3 లక్షల వరకు ఖర్చు చేశారు.

నిధులు దుర్వినియోగం..

2022 సంవత్సరం సెప్టెంబర్‌లో మండలకేంద్రంలో బృహత్ పల్లె ప్రకృతి వనం కోసం తహసీల్ వెనుక నాలుగెకరాల భూమిని కేటాయించారు. అంచనా వ్యయం సుమారు రూ.10 లక్షలు వెచ్చించి 15వేల మొక్కలు లక్ష్యంతో పల్లె ప్రకృతి వనం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అంతే మొక్కలైతే నాటారు కానీ నేడు ఒక్క మొక్క ఎదగలేదు.. బతకలేదు. అంతకు ముందు రెండేళ్ల క్రితం పెద్దగోపవరం – ఎర్రుపాలెం రహదారి వెంబడి ప్రభుత్వ భూమిలో సుమారు రూ.5లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనంలో కూడా ఒక్క మొక్కకూడా బతికిన దాఖలాలు లేవు. దీంతో అక్కడా కూడా నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఆ భూమి అంతటా చవుడు నేలగా ఉన్నప్పటికీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో రెండు సార్లు మొక్కలు వేసినా బతకలేదు. ఇక అంతే అప్పటినుంచి పల్లె ప్రకృతి వనాలను, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు.

అధికార యంత్రాంగం తీరుతో ప్రకృతి వనాల్లో ఎండిపోయిన మొక్కలే కనిపిస్తుండడంతో ప్రజల్లో అసహనం వ్యక్తమవుతుంది.

చవుడు నేల ఎంపిక సరికాదు..



ప్రకృతి వనాల ఏర్పాటుకు అధికారులు చవుడు నేలలను ఎంపిక చేయడం సరికాదు. మా హయాంలో 2021 సంవత్సరంలో పెద్దగోపవరం సమీపంలోని 4.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో లక్షలు వెచ్చించి బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఆ భూమిలో అంతా చవుడు కావడంతో ఒక్క మొక్క బతకలేదు. ఆరంభంలోనే చవుడు భూమిని ఎంపిక చేయొద్దని అధికారులను వేడుకున్నప్పటికీ వినిపించుకోలేదు.

– ఇనపనూరి శివాజీ, మాజీ సర్పంచ్, పెద్దగోపవరం

పంచాయతీలకు అప్పగించాం..



పల్లె ప్రకృతి వనాల నిర్వహణను గత రెండేళ్ల క్రితమే ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించాం. అప్పట్లో ఈజీఎస్ ద్వారానే ప్రకృతి వనాల్లో మొక్కలు నాటాం. ఆ తర్వాత వనమాలిలతో వాటరింగ్ కూడా చేయించాం. ప్రస్తుతం వాటి నిర్వహణతో ఈజీఎస్‌కు ఏమాత్రం సంబంధం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 31 గ్రామ పంచాయతీల్లో ఒక్కొక్క నర్సరీలో 1,55 లక్షల మొక్కలను పెంచుతున్నాం. 34 ఎకరాల్లో మునగ మొక్కలను వేశాం.

– కె.నాగరాజు, ఏపీఓ, ఈజీఎస్, ఎర్రుపాలెం

కార్యదర్శులతో సమీక్షిస్తాం..



పల్లె ప్రకృతి, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణను ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకే అప్పగించిన విషయం వాస్తవమే. ప్రకృతి వనాల నిర్వహణ సక్రమంగా చేసే దిశగా త్వరలో కార్యాచరణ చేపడతాం. ఈ విషయమై వారం రోజుల్లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష చేస్తాం. మండలకేంద్రంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం భూమి చవుడు నేల కావడంతో మొక్కలు ఎదగడం కష్టంగా మారింది. ప్రకృతి వనాల నిర్వహణపై దృష్టి పెడతాం.

– బి.సురేందర్, ఎంపీడీఓ, ఎర్రుపాలెం

సమ్మర్‌క్యాంపును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు: ఈ నెల 11 నుంచి 26వరకు నిర్వహించే సమ్మర్‌క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక గురుకుల విద్యాలయంలో సమ్మర్‌క్యాంపు ప్రారంభించి మాట్లాడారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డాన్స్ క్రాఫ్ట్, యోగ శిక్షణా తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం 9701222080 ఫోన్ నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ దంపతులపై అనుచిత వ్యాఖ్యలు గర్హనీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా సోమవారం పలువురు నాయకులు మాట్లాడుతూ లంకపల్లిలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ నున్నా రామకృష్ణ ఇటీవల ఎమ్మెల్యే తమ గ్రామానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని ఆరోపించడమేకాక దయానంద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఇకనైనా ఆయన తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, చీకటి రామరావు, సోమరాజు సీతారామారావు, ఈడా కమలాకర్‌రావు, రాజబోయిన కోటేశ్వరరావు, మాళోతు రాధకృష్ణ, మేకతొట్టి కాంతయ్య, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, నరేంద్ర, పిల్లి నవజీవన్, అలుగోజు చిన్నస్వామి, గోదారాములు, కిషోర్, నరోత్తమరెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మధిర: సమావేశంలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

మధిర: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానలను నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరంపల్లి చంటి పిలుపునిచ్చారు. సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మధిరలో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మెకు అన్ని ట్రేడ్ యూనియన్లు మద్దతు ప్రకటించాయని, కార్మికులు సమాయత్తం కావాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మధిర మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శీలం నర్సింహారావు, రామారావు, ఐఎన్‌టీయూసీ మధిర పట్టణ అధ్యక్షుడు బాజీ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమ్మె వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ..

ముదిగొండ: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ.. సోమవారం ముదిగొండలో జేఏసీ నాయకులు వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు సమస్యలు పరిష్కరించేదాక కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్ల యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, ఈశ్వారాచారీ, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత..

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలకేంద్రంలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ శ్రీలక్ష్మిలకు సమ్మె నోటీస్‌ను సోమవారం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించి అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరామయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రామకష్ణ, మంగ్యా, ప్రసాద్, ప్రశాంత్, రాజేష్ తదితరులున్నారు.

తప్పుడు కథనాలు సరికాదు

వైరా: లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా ద్వారా 2009లో లయన్స్ ఐకేర్ సెంటర్ ప్రారంభించి ఇప్పటి వరకు 40 వేల కంటి ఆపరేషన్లు నిర్వహించగా, ఓ విలేకరి (సాక్షి కాదు) తప్పుడు కథనాలు రాయడం సరికాదని లయన్స్‌క్లబ్ బాధ్యులు పేర్కొన్నారు. ఆపరేషన్ సమయాన బీపీ, షుగర్ బాధితులకు చిన్నచిన్న సమస్యలు వస్తాయని తెలిపారు. ఇది పరిగణనలోకి తీసుకోకుండా తప్పుడు కథనాలు రాసిన సదరు విలేకరిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్సై పుష్పాల రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఐకేర్ నిర్వాహకులు ఉండ్రు శ్యాం బాబు, లయన్స్‌క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



వృద్ధురాలికి సరుకులు అందిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుమన్ బాబు సోదరుడు ఏనుగు కిషోర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సోమవారం అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు సుమారు రూ.20 వేలు విలువ చేసే నిత్యావసరలు అందించారు. కార్యక్రమంలో ఎంపీ.దాను, ఏనుగు శివ, రాఘవ యం.సుభానీ, ఏనుగు కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లూర్దుగిరి పుణ్యక్షేత్ర తిరునాళ్లు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో ఈ నెల 13 నుంచి 15వ వరకు లూర్దుగిరి మాత పుణ్యక్షేత్ర వేడుకలను నిర్వహించనున్నట్లు విచారణ గురువులు కొప్పుల శౌరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు క్రైస్తవ సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.90వేల చెక్కులను బాధిత కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగసూరారెడ్డి, జనార్దన్, భద్రారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం



లక్ష్మీపురం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్: భూ సమస్యల పరిష్కరానికే అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. సోమవారం మండలంలోని రాయన్నపేట, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో.. మొత్తం 150మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ పరమైన దరఖాస్తులు అందిస్తే.. వాటిని పరిష్కరిస్తామన్నారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరచి, రసీదు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, ఆర్ఐలు నవీన్, మైథిలీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు పరిశీలన..

మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను తహసీల్దార్ పున్నం చందర్ సోమవారం పరిశీలించారు. లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని 401 సర్వే నంబర్‌లో 30ఎకరాలను సేకరించినట్లు తెలిపారు. స్కూల్ నిర్మాణానికి సంబంధించి రహదారుల నిర్మాణం పూర్తికావస్తుందన్నారు. గతంలో 25 ఎకరాలు మాత్రమే భూసేకరణ జరిగిందని, ప్రస్తుతం మరో 5 ఎకరాలను కూడా గుర్తించినట్లు తెలిపారు.

ఘనంగా శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏన్కూరు: మండల పరిధిలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సుప్రభాత సేవ, నిత్య ఆరాధన, నిత్యహోమం, పూర్ణాహుతి, యాగశాల, ఆరాధానలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం రాత్రి 9 గంటల9 నిమిషాలకు మేళతాళల, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించగా.. దాత జాలాది దొర బాబు దంపతులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి దీవెనలు పొందారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి ఎస్‌వీడీ ప్రసాదు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ భూక్యా లాలు, మద్దిగుంట నర్సింహారావు,చిరుమామిళ్ల లక్ష్మయ్య, అర్చకులు భద్రి, వేణుగోపాల్, నాగరాజు, కిరణ్‌కుమార్, నిఖిల్, కిషోర్, నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి తుమ్మలమ్మ చెరువుగట్టుపై ఉన్నటువంటి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వేదపండితుడు రామానుజచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ పద్మావతి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో గణపతిపూజ, విశ్వక్సేనారాధన, పుణ్యహవచనం, యజ్ఞోపవేద ధారణ, పాద ప్రక్షాన్నం, కన్యాదానం వంటి పూజా కార్యక్రమాల అనంతరం జిలకర బెల్లం, మాంగల్యధారణ, ఆశీర్వచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించగా.. భక్తులు ప్రత్యేకపూజలు జరిపగా ఆలయ కమిటీ సభ్యులు మహాఅన్నదానం నిర్వహించారు. భక్తులు స్వామికి విరాళాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోటకూరి వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపికృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ సిద్దల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, చింతకాని, పాతర్లపాడు, నాగులవంచ గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటసాయి నగర్‌లో బోనాల సమర్పణ

కారేపల్లి: మండల పరిధిలోని శ్రీవెంకటసాయినగర్‌లో నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి విగ్రహాలకు సోమవారం బోనాల సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు బొనాలను నెత్తిన పెట్టుకొని సాంస్కృతిక నృత్యాలతో, పాటలు పాడుతూ.. ప్రదర్శనగా వచ్చి ముత్యాలమ్మకు, బొడ్రాయికి బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో వెంకటసాయి నగర్‌లో పండుగ వాతావరణం సంతరించుకుంది. భక్తులు తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. వెంకటసాయి నగర్ అధ్యక్ష కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, ఈసం భాస్కర్‌లు పర్యవేక్షించగా కమిటీ సభ్యులు రాంబాబు, నాగేశ్వరరావు, రామారావు, దుర్గయ్య, సమ్మయ్య, కర్ణ, శంకర్, హన్మంతరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఏన్కూరు: ఏన్కూరులోని సాగర్‌కాల్వ సమీపంలో నివాసముంటున్న ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు తెలిపారు. సోమవారం సీపీఎం నాయకులు, గ్రామస్తులు తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సదర్భంగ వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, వాటర్‌ట్యాంక్ నిర్మాణం చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, బానోత్ బాలాజీ, ఇటికాల లెనిన్, గ్రామస్తులు అంజి, నాగమణి పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు దూరం..



వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ఇంటర్‌తోనే సరిపెట్టుకుంటున్న స్టూడెంట్స్
- ఒక్కో మండలానికి 400మంది..
- డిగ్రీ కళాశాల లేక ఇంటికే పరిమితం

వైరా: వైరా నియోజవర్గంలో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. చదువుకోవాలని తపన ఉన్నా అనుకూలించని పరిస్థితిలు వల్ల చదువులు అసంపూర్తిగానే ముగుస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో పలువురు విద్యార్థులు ఇంటర్ తర్వాత ఇంటికే పరిమితమవుతున్నారు. కొణిజర్ల మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. అదే డిగ్రీ చదవాలంటే.. దూరంగా వెళ్లలేక చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారు. కానీ నియోజకవర్గంలోని ఏఒక్క మండలంలో కూడా డిగ్రీ కళాశాల లేకపోవడం విశేషం. పలుచోట్ల ప్రైవేట్ కళాశాలలు ఉన్నప్పటికీ ఫీజులు చెల్లించలేక చదువులకు దూరం అవుతున్నారు.

ప్రతీ ఏడాది 2,500మంది విద్యార్థులు..

నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు ప్రతి ఏడాది 2,500మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. తరువాత డిగ్రీ చదవాలంటే స్థానికంగా కళాశాల లేకపోవడంతో సగానికి పైగా విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావాల్సి వస్తుంది. అయితే మిగిలిన విద్యార్థులు ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలకు వెళ్తున్నారు. వైరా, కారేపల్లి మండలాల్లో ప్రైవేట్ కళాశాలలు ఉన్నప్పటికీ సైన్స్ గ్రూపులు లేకపోవడంతో.. ఆర్ట్ చదవలేక, దూరప్రాంతాలకు వెళ్లలేక ఇళ్లవద్దనే కాలం వెల్లబుచ్చుతున్నారు.

డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి..

ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండి, మంచి ఫలితాలు సాధిస్తున్నా వైరా, ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో విద్యార్థులు డిగ్రీ కళాశాలలకై ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. అతేకాక నియోజకవర్గానికి కేంద్రమయిన వైరా చుట్టు పక్కల ఉన్న కొణిజర్ల, తల్లాడ, ఏన్కూరు, బోనకల్లు మండలాలకు అందుబాటులో ఉంటుంది.

అధికారులు పట్టించుకోని ఇక్కడ ఓ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులందరికీ సౌకర్యవంతంగా ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే విద్యార్థి సంఘాల నాయకులు.. ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించడం జరిగింది. అయినా ఎటువంటి స్పందన లేదు.